
# గుండునొప్పి

రసరాజు

"ఎక్కడ్రా చెక్కిస్త.... గుండ్లకమ్మ వాగులాగ గుండుమాంచి నిగనిగలాడుతోంది... ఏది ఇలారా... చూద్దాం...."

సత్తెయ్య ముసిముసినవ్వులు చిందిస్తూ యజమాని దగ్గరికొచ్చాడు. యజమాని పెంటయ్య తనివితీరా గుండును తడిమిచూసి "భేషుగ్గా ఉందిరా అబ్బీ..." అంటూ సర్టిఫికేట్ ఇచ్చేస్తూ ఊరుకోకుండా ఓ మొట్టికాయ కూడా కానుకగా అందించాడు.

గుండు గుభిల్లుమన్నా సత్తెయ్య ఏవీ అనకుండా యజమానికేసి చూసి వెకిలిగా నవ్వాడు.



"ఎక్కడిచ్చావురా మొక్కు...." పెంటయ్య ప్రశ్నించాడు.

ఆ మొట్టికాయ మంట ఇంకా తగ్గలేదు. ఓ వైపు నెత్తిపై చేత్తో రుద్దుకొంటూనే "సిన తిరుపతి...." అంటూ నోరు విప్పాడు సత్తెయ్య.

"ఈ రెండ్రోజుల్లోనే నువ్వు ఏలూరెళ్లి చేసిన పని ఇదిరా... సరేకాని... ఓ టోపీ కొనుక్కోలేకపోయావా...."

"కొన్నానండీ..."

"కొన్నావా... అసలు దానికోసమే నువ్వు గుండు గీయించుంటావు... మరి పెట్టుకో లేదేవిరా..."

"మీ దగ్గర బావుండదు కదాండి..." సత్తెయ్య సిగ్గుపడుతూ అన్నాడు.

"ఓరి భడవా..." అంటూ దగ్గరికి పిలిచి మరో మొట్టికాయ తగిలించాడు.

నున్నగా వున్న ఆ గుండును చూసే కొద్దీ ఎందుకో పెంటయ్యకి రెచ్చిపోవాలనిపిస్తోంది.

ఇంతలో వీధిలోంచి పల్లీలకేక వినిపించింది.

పెంటయ్యకి పల్లీలంటే పరమప్రాణం. వేపించిన ఆ కాయల్ని కొట్టి ఒకో గింజ నోట్లో వేసుకొంటుంటే అతనికి భలే రంజుగా వుంటుంది.

"ఆ పల్లీల్ని పిలవరా..."

సత్తెయ్య ఆ పల్లీలకుర్రాణ్ణి తీసుకొచ్చాడు.

"ఎలా ఇస్తున్నావ్..."

ఏదో చూపించి "దండయితే రెండ్రూపాయలండి..." అన్నాడు ఆ కుర్రాడు.

పెంటయ్య బేరమాడాడు.

కుర్రాడు కిట్టదన్నాడు.

"సరే... మూడ్రూపాయలు కాయలియ్... సమయానికి మా సత్తెయ్య కూడా సిద్ధంగా వున్నాడు...." అన్నాడు పెంటయ్య.

సత్తెయ్యకి ఆ మాట చెవినపడగానే ఆశ్చర్యమేసింది. 'ఎంగిలి మెతుకే విదపని ఆ దరమాత్ముడు పల్లీలు కొంటూ తనను గుర్తు పెట్టుకోటమా...' నమ్మలేకపోయాడు సత్తెయ్య. నిజానికి తనక్కూడ పల్లీలంటే ఇష్టమే. రెండుమూడు కాయలైనా తన నోటి దగ్గరకొస్తాయనుకొన్నాడు.

కుర్రాడు కాయలిచ్చి వెళ్లిపోయాడు.

ఆ కాయల్నీ, పక్కనే వున్న సత్తెయ్యని చూడగానే పెంటయ్యకి భలే సరదా పుట్టింది.

"పనీ పాటా లేదు వెధవకి... పీకలదాకా భోజనం పెట్టి నెలకి మూడొందల జీతం... దేనికైనా ఆసరాగా వుంటాడని పెట్టుకోటం తప్ప పూచికపుల్ల కదిపే పనుండదు బడుద్దాయికి..." అనుకొంటూ సత్తెయ్య గుండుకేసి చూశాడు పెంటయ్య.

" ఇలా రారా..."

సత్తెయ్య భయపడుతూ యజమాని దగ్గరికొచ్చాడు.

"నా కుర్చీముందు కూర్చో..."

"......"

"కూర్చోరా.... నిన్నే..."

సత్తెయ్య గుండు తడుము కొంటూ జడుస్తూకూర్చున్నాడు.

పెంటయ్య పల్లీ న్నీ పక్కనే వున్న స్టూలుపై భద్రంగా పెట్టుకొన్నాడు.

''మరీ అంత గట్టిగా కొట్టనేలే.... ఏవీ భయపడకు... పదే పదినిమిషాలు ఓపికపట్టు... సరిపోతుంది....''

సత్తెయ్యకి పెంటయ్య ప్లానేవిటో అర్థం కాలేదు.

''సరిగ్గా కూర్చున్నావా...''

'' ఆయ్...'' అనే అర్థం వచ్చే గుండు ఆడించాడు సత్తెయ్య.

పెంటయ్య బోణీగా ఒక కాయతీసి సత్తెయ్య గుండు మీద కొట్టి ఆ పల్లీలు నోట్లో వేసుకొన్నాడు.

''బలే కమ్మగా వున్నాయిరా సత్తీ... ఎక్కడ పండాయోకాని.... ''అంటూ మరోకాయ కొట్టాడు ఆ గుండుమీద.

పదికాయల వరక సత్తెయ్య నోరెత్తలేదు. అలాగే భరించాడు...

పదకొండోకాయకి మాత్రం ''గుండుమీద కాస్త తుండు వేసుకుంటా అయ్యగారూ....'' అంటూ ప్రాధేయపడ్డాడు.

''మెల్లగానే కొడతన్లే... గుండేవీ చితికిపోదులే వెధవా...'' పెంటయ్య ఊరటపలికాడు.

'గుండు గీయించుకోకపోయినా బావుండేది... అయినా ఇదేం సరదారా ముదనష్టపోడికి...' సత్తెయ్య తనలో తాను గొణుక్కున్నాడు.

కాయలు పూర్తయేవరకు సత్తెయ్య దించిన తల ఎత్తలేదు.

''ఈ తుక్కు బయటపడేసి లెమన్ టీ పట్టుకురా...'' పెంటయ్య బొజ్జ సవరించుకుంటూ పైకి లేచాడు.

''దరిద్రుడు ఒక్క గింజయినా పెట్టలేదు... కాయలు నేలకేసి కొట్టుకుని తింటే ఆడి సొమ్మేం పోతుంది... తన గుండే దొరికిందా మాయదా రోడికి...'' సత్తెయ్యకు గుండుతోపాటు గుండెకూడా మండిపోయింది. అయినా ఏం చేస్తాడు? ఈ కాలపు మనిషి కాదు... బాధయితే వుంది కాని ఎదిరించి ఏవీ అనలేడు... పెట్టింది తినటం... తిట్టినా కొట్టినా పడటం... తెలివితేటలకి లోటేవీ లేకపోయినా బానిసబతుకయిపోయింది.

సత్తెయ్య ఆ తుక్కు దూరంగా పడేసి లెమన్ టీ పట్టుకొచ్చాడు. ప్రతిరోజూ సాయంత్రం నాలుగ్గంటల వేళలో లెమన్‌టీ తాగటం పెంటయ్యకు నాలుగేళ్ల నుంచీ అలవాటు.

ఆ రాత్రి సత్తెయ్యకు సరిగా నిద్రపట్టలేదు.

గుండంతా నొప్పిగా వుంది. గుండెనొప్పి గురించి విన్నాడు కాని 'గుండునొప్పి' గురించి ఎప్పుడూ వినలేదు. సాటి మనుషుల్ని చావగొట్టి సరదాలు చేసుకోటం పెంటయ్యకి మామూలే. సత్తెయ్య ఆ విషయాన్ని పనిలోకొచ్చిన తొలిరోజే గమనించాడు. ఆ మాటే సత్తెయ్య ఎవరిదగ్గరో అంటే ''వాడో శాడిస్టులే...'' అని తేల్చి చెప్పేశారు అవతలి వాళ్లు. ఆ ఇంగ్లీషు పదానికి అర్థమేమిటో సత్తెయ్యకు ఇప్పటికీ తెలీలేదు. కాని అప్పుడప్పుడు సత్తెయ్య మనసులో మాత్రం 'శాడిట్టు... శాడిట్టు...' అనే పదం దొర్లుతూనే వుంది.

'ఆడికీ సమయమొస్తుందిలే....' అనుకొంటూ సత్తెయ్య బండి లాగించేస్తున్నాడు. వంశపారంపర్యంగా ఆ కుటుంబం ఉప్పుతిని బతికారు తన పెద్దోళ్లంతా. ఆ విశ్వాసంతో అన్నీ సరిపెట్టుకొంటున్నాడు సత్తెయ్య.

***

ఆ మరుసటి రోజు-

మధ్యాహ్నం మూడు గంటలు....

''పల్లీలు... పల్లీలు...'' అంటూ పై వీధిలో కేక వినిపించింది. ఆ కేక చెవిలో పడీ పడగానే సత్తెయ్య మెల్లగా పక్కనే ఉన్న బాత్‌రూంలోకి జారుకొన్నాడు.

''ఒరేయ్ సత్తిగా...'' పెంటయ్య పిలిచాడు.

అలా ఒకసారి కాదు- మూడుసార్లు గొంతు చించుకొన్నాడు.

' ఎక్కడ చచ్చాడో వీడు...'' పెంటయ్య విసుక్కొన్నాడు.

'' ఇవ్వేళ్టికి గండం గడిచిందిలే'' అనుకొన్నాడు సత్తెయ్య... బాత్‌రూంలో దాక్కుని.

కానీ తాడే పామైనట్టు ఆ పల్లీల కుర్రాడు పిలవకుండానే పెంటయ్య దగ్గిరికొచ్చి ''పల్లీలు తీసుకుంటారా బాబూ...'' అంటూ ఎదురుగా పల్లీల గంప పెట్టాడు.

**''దరిద్రుడు ఒక్క గింజయినా పెట్టలేదు... కాయలు నేలకేసి కొట్టుకుని తింటే ఆడి సొమ్మేం పోతుంది... తన గుండే దొరికిందా మాయదా రోడికి...''**

''సరే... నాల్రూపాయలకాయలియ్...'' పెంటయ్య ఉత్సాహంగా అన్నాడు.

ఆ మాట- పక్కనే బాత్‌రూంలో వున్న సత్తెయ్యకి వినపడింది.

''నిన్న మూడు... ఇయ్యేల నాలుగు... అయ్య బాబోయ్... పల్లీల మీద ప్రేమో తన గుండుమీద ప్రేమో...'' సత్తెయ్య, దెబ్బతో దిగాలు పడిపోయాడు.

పెంటయ్య ఆ పల్లీల్ని ఒక్కటీ తినకుండా అన్నీ అలాగే ఉంచేశాడు.

'' ఏరా ఎక్కడ తగలడ్డావు....'' ఈ సారి చెట్టూ చేమా అదిరేలా పెంటయ్య అరిచాడు.

''వత్తున్నానయ్యా.... అలా బాత్రూంలో కెళ్లా....'' నసుగుతూ ఎదురు పడ్డాడు సత్తెయ్య- ఇక లాభంలేదనుకొని.

''అఘోరించలేకపోయావూ... సరేగాని కాళ్లూ చేతులూ శుభ్రంగా కడుక్కొని చచ్చావా...''

''ఆయ్... '' సత్తెయ్య మాట మింగేస్తూ అన్నాడు.

''అయితే నిన్న కూర్చున్నట్లే నా కుర్చీముందు కూర్చో...''

సత్తెయ్య అటూ యిటూ దిక్కులు చూశాడు.

గోడల మీదున్న దేవుడి పటాల్ని చూశాడు.

''దిక్కులు చూస్తావేమిట్రా దిష్టిపిడత వెధవా... కూర్చో...''

కళ్లల్లో నీళ్లు కుక్కుకొంటూ సత్తెయ్య నిన్నటలాగా ఆ కుర్చీముందు కూర్చున్నాడు.

''ఏరా నొప్పిగా వుందా...'' గుండుమీద ఒక కాయకొట్టి పెంటయ్య అడిగాడు.

సత్తెయ్య బదులు పలకలేదు.

''ఇక నొప్పి వుండదులే... రాను రాను మెల్లగా నువ్వే అలవాటు పడిపోతావ్... ఆ తరువాత నీ గుండుపై పల్లీలు కొట్టకపోతే నీకే నిద్రరాదు...''

కుక్కిన పేనులా సత్తెయ్య ఆ పల్లీలు పూర్తయే వరకు గుండు అప్పగించి అక్కడే గుంభనంగా కూర్చున్నాడు.

మధ్య మధ్యలో ''అమ్మోయ్... బాబోయ్...'' వంటివి పెంటయ్యకి వినపడ్డాయి కాని- ఆ చిన్నా చితకా అరుపుల్ని లెక్కలోకి తీసుకోలేదు.

''ఈ తుక్కు పడేసి లెమన్‌టీ పట్రా...'' పెంటయ్య మళ్లీ నిన్నటి పేజీనే తిరగేశాడు.

సత్తెయ్య పైకి లేవలేకపోయాడు. అక్కడే కూర్చున్నాడు...

''లేవరా...'' అంటూ ఓ మొట్టికాయ తగిలించాడు పెంటయ్య.

ఈ సారి సత్తెయ్యకి నిజంగానే కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరిగాయి. అవి కనపడకుండా చేత్తో తుడిచేసుకొని దూరంగా వెళ్లి తుక్కుపడేసి, గోరువెచ్చని లెమన్ టీ తెచ్చి యజమాని ముందు పెట్టాడు.

''పల్లీలు నిన్నటి కంటే బాగున్నాయి సత్తిగా... రేపు ఏకంగా అయిదు రూపాయిలిచ్చేద్దాం....''

ఆ మాట అనగానే సత్తెయ్యకు పై ప్రాణాలు పైనే పోయినట్లనిపించింది.

ఇప్పటికే గుండు బొప్పి కట్టేసింది.

మూడో రోజు కూడా అదే వరసయితే గుండుకు ముసుగేసేసి మూలన కూర్చోవాల్సిందే... పైగా కాయలెక్కువ.... అయిదు రూపాయిలివి...

ఆ రాత్రి కూడా సత్తెయ్య కంటిమీదకు కునుకు రాలేదు.

ఈ గండం గడిచి బయటపడేదెలాగో అర్థం కాలేదు.

ఆలోచించాడు...

తన బాగు ముందు అన్నీ బలాదూరే అనుకొన్నాడు...

పక్కనే గుడిలోవున్న రావులోరికి ఏదో మొక్కుకున్నాడు.

* * *

తెల్లారింది.

'ఆరు.... ఏడు... ఎనిమిది...' ఇలా సత్తెయ్య గంటలు లెక్కెడుతున్నాడు.

అనుకొన్నట్టుగానే మూడుగంటలకు ముప్పు ముంచుకొచ్చేసింది.

ఆ టైంలో సత్తెయ్య ఏదైతే వినకూడదనుకొన్నాడు సరిగ్గా అదే విన్నాడు.

పల్లీలు... పల్లీలు...

ఏదైతే అది అవుతుందని సత్తెయ్య నిన్నటి లాగే మళ్లీ బాత్‌రూంకెళ్లి తలదాచుకొన్నాడు.

'' ఒరే సత్తిగా...''

పెంటయ్యకి సత్తెయ్య ఆచూకీ అక్కడ దొరకలేదు.

అయినా మళ్లీ పిలిచాడు.

సత్తెయ్య నుంచి ఉలుకూ పలుకూ లేదు...

''అయిదు రూపాయిల కాయలియ్... '' అలా అంటూనే గంపలోంచి రెండు కాయలు తీసి ఒలిసి నోట్లో వేసుకొన్నాడు పెంటయ్య.

ఈ మాటలన్నీ బాత్‌రూంలో నక్కిన సత్తెయ్యకి వినిపిస్తూనే వున్నాయి.

''మొన్న మూడు... నిన్న నాలుగు... ఈయాల అయిదు... వాడి తిండి మాటేమో కాని నా గుండు నంజుకు తింటున్నాడు సన్నాసోడు... ఇంట్లో వాళ్లందరూ ఊరికిపోయి ఈ చండాలుణ్ణి అయిదురోజుల దాకా చూడమని నా కప్పగించారు. ఇంకా రెండ్రోజులు గడవాలి... ఇంకా నయం... వంటమనిషి పొద్దున్నే వండేసి పోతుంది కాబట్టి సరిపోయింది...'' సత్తెయ్య తనలో తానే కసిగా గొణుక్కున్నాడు.

అసలు ఆ ఉదయం సత్తెయ్య ఆ పల్లీల కుర్రాడింటికెళ్లి ''ఇటువేపు రాకురా బాబూ... వచ్చినా ఆ ఇంటి దరిదాపుల్లో కేకేయకు... నీకు పున్నె ముంటుంది...'' అంటూ విషయం చెప్పి కాళ్లా వేళ్లా పడ్డాడు. నెత్తీ నోరూ బాదుకొన్నాడు.

''మంచోడివే... మీకు మీకూ సవాలక్ష ఉండొచ్చు... మద్దెన నా యాపారానికి చిల్లెట్టుకో మంటావా....'' ఆ పల్లీల కుర్రాడు చిన్నోడయినా సత్తెయ్యని ఎడాపెడా వాయించి వదిలిపెట్టాడు.

''పోనీ... ఓ ఉపకారం చేసి పెడతావా... చివరికోరిక'' అన్నాడు సత్తెయ్య విధిలేక.

ఏమిటన్నట్లు చూశాడు ఆ కుర్రాడు - చిరంజీవి స్టయిల్లో.

''ఏవీ లేదు... చచ్చి నీ కడుపున పుడతాను... నేనిలా వచ్చినట్లు ఎక్కడా అనుబోకు... అదే నువు చేసే గొప్ప ఉపకారం...'' బతిమాలుతూ అన్నాడు సత్తెయ్య.

ఆ కుర్రాడు ''సర్లే... పో....'' అన్నట్లు చూశాడు.

సత్తెయ్య అప్పుడు ధైర్యంగా ఇంటిముఖం పట్టాడు.

''ఏరా తలమాసిన వెధవా... సత్తిగా...'' పెంటయ్య మళ్లీ నోరు చించుకున్నాడు.

'నిత్య దరిద్రుడికి గుండు మీద కొట్టి తింటేనే కాని గుటకపడదేమో...' సత్తెయ్య తిట్టుకుంటూ తప్పేది లేదని బాత్‌రూంలోంచి బయటికొచ్చాడు.

''కూర్చోవెధవా... ఎక్కడ తగలడ్డావ్ ఇప్పటిదాకా...''

''బ... బ... బాత్‌రూం....'' ఎప్పుడూ లేని తడబాటు సత్తెయ్యలో ఆ రోజు కనిపించింది.

''అవునుగానిరా.. టోపీ పెట్టుకొన్నావేమిటి?..'' టోపీ చూస్తూ అన్నాడు పెంటయ్య.

''ఇదుంటే బావుంటందని తవరే అన్నారుగా....''

''చంపేస్తా వెధవా... తీసెయ్... సరేగాని... పల్లీలనగానే పలాయనం చిత్తగిస్తున్నావేమిట్రా బాత్‌రూంలోకి... కూర్చో... ఆ టోపీ ఇలా ఇయ్....''

సత్తెయ్య ఏడుపు ముఖం పెట్టి ఆ టోపీ పెంటయ్య చేతిలో పెట్టేశాడు.

''కూర్చో....'' పెంటయ్య రెండోసారి గద్దించాడు.

సత్తెయ్య గతిలేక గుండు పెంటయ్యకి ఇచ్చేశాడు.

కాయలు పూర్తయేసరికి సత్తెయ్యకి గుండు కమిలిపోయినట్లనిపించింది.

''వెళ్లి లెమన్ టీ పట్టుకురా... ఈ తుక్కు దూరంగా పడేయ్...''

సత్తెయ్య అలవాటైన డైలాగే విన్నాడు మళ్లీ.

సత్తెయ్య ఆ రెండు పనులకీ మధ్యలో ఆగలేక గుండుకు కొంచెం కొబ్బరినూనె పట్టించాడు.

పెంటయ్య లెమన్ టీ తాగి పక్కనే వున్న దివాన్‌కాట్‌పై నడుం వాల్చాడు.

మరోగంటకి-

ఉన్నట్లుండి పెంటయ్య గాభరాగా పైకిలేచాడు.

''ఒరేయ్ సత్తిగా...'' అంటూ బాత్‌రూంలోకి వడివడిగా నడిచాడు.

సత్తెయ్య కూడా పెంటయ్య వెనకాలే అడుగు లేశాడు.

పెంటయ్య బాత్‌రూంలోకెళ్లి వెంటనే తలుపేసుకున్నాడు.

సత్తెయ్య అక్కడే దూరంగా నిలబడ్డాడు.

''పెంటయ్యగారూ....'' బాత్‌రూంలోంచి రాగానే సత్తెయ్య అడిగాడు.

''ఏముందిరా వెధవా... చూశావుగా....''

**''అదే తేడా చేసింది... పల్లీలు అదేపనిగా తినటం ఇక మానేయండి... ఈ వయసులో పప్పులూ అవీ పడవు... జాగ్రత్తగా వుండాలి. ఇదిగో ఈ గొట్టాలూ బిళ్లలూ వేసుకోండి. ఈ రాత్రికి ఏవీ తినొద్దు...''**

విసుక్కొన్నాడు పెంటయ్య.

పదినిమిషాలు కూడా గడవలేదు...

పెంటయ్య మళ్లీ బాత్‌రూంలోకి పరుగెత్తాడు.

అలా గంటసేపట్లో మూడుసార్లు పెంటయ్య బాత్‌రూంని చూడక తప్పిందికాదు.

''పోనీ... అక్కడే కూర్చోండి... కుర్చీవేస్తాను... పదే పదే అటూ ఇటూ ఏం తిరుగుతారు...'' సత్తెయ్య సానుభూతి చూపిస్తూ అన్నాడు.

ఆ మాటకు పెంటయ్య అగ్గిమీద గుగ్గిలమై పోయాడు.

''ఆగు వెధవా!... ఈ గొడవ తగ్గనీ... రేపట్నుంచి నీ గుండు కోసమైనా పదేసి రూపాయిల పల్లీలు కొంటాను... అప్పుడు కాని నీకు తిక్క కుదరదు'' అంటూ చెడామడా తిట్టిపారేశాడు సత్తెయ్యని.

నాలుగోసారి బాత్‌రూం చూశాక - పై వీధిలో వున్న కాంపౌండర్ని అర్జెంటుగా పిలుచుకురమ్మన్నాడు పెంటయ్య.

కాంపౌండర్ వచ్చాడు.

''ఏం తిన్నారు?...''

''పొద్దుటిపూటే భోంచేస్తాను... మళ్లీ రాత్రి మజ్జిగ... పళ్లు... ఇంకేం ముట్టుకోను... ఈ మూడ్రోజుల్నుంచి మాత్రం మధ్యాహ్నం పల్లీలు తింటున్నాను. లెమన్‌టీ మామూలే.... అదెప్పుడూ తీసుకొంటాను....''

''అదే తేడా చేసింది... పల్లీలు అదేపనిగా తినటం ఇక మానేయండి... ఈ వయసులో పప్పులూ అవీ పడవు... జాగ్రత్తగా వుండాలి. ఇదిగో ఈ గొట్టాలూ బిళ్లలూ వేసుకోండి. ఈ రాత్రికి ఏవీ తినొద్దు...'' కాంపౌండరు ఖరాఖండీగా చెప్పి బయటి కొచ్చాడు.

అతను అలా వెళ్లాడో లేదో- పెంటయ్య మళ్లీ బాత్‌రూంలోకి పరుగు లంకించుకున్నాడు.

సత్తెయ్య ఎగిరి గంతేయటం బాత్‌రూం కన్నంలోంచి పెంటయ్య గమనించాడు.

పరిస్థితి బాగోలేదు కాని- అదే క్షణంలో వెళ్లి గుండు పగలకొట్టాలనిపించింది. అక్కడికీ ఊరుకోలేదు.

బయటకొచ్చాక కళ్లెర్రచేసి మరీ అడిగాడు '' ఏట్రా ఆ గంతులూ... ఆ సరదాలూ...'' అని

''ఏవీ లేదయ్యా... కాళ్లకి వానపామేదో చుట్టుకొంది... ఒళ్లు జలదరించింది...'' అంటూ నసిగాడు సత్తెయ్య.

ఎలాగైతేనే- ఆ రాత్రికి పెంటయ్య స్థిమిత పడ్డాడు. విరోచనాలు తగ్గాయి.

* * *

ఆ మరుసటి రోజు ఉదయం-

సత్తెయ్య వీధిలో తనను చూసి తప్పించుకొని తిరగటం కాంపౌండర్ చూశాడు.

''సత్తెయ్యా...'' కాంపౌండర్ పిలిచాడు.

సత్తెయ్య నీళ్లు నములుతూ దగ్గరికొచ్చాడు.

''విరోచనాలవటానికి మందు అడిగింది నీకా... నీ కామందుకా...'' ప్రశ్నించాడు.

సత్తెయ్య ఆ మాటతో బిక్క మొగమేశాడు.

''మొత్తం మీద ఆ లెమన్‌టీలో కలిపేసి ఇచ్చేశావన్నమాట.... పాపం నువ్వు మాత్రం ఏం చేస్తావులే... నిన్న చూశా నీ పరిస్థితి... మీ పెంటయ్యగారి సరదా... ఎలుక్కి ప్రాణసంకటం... పిల్లికి చెలగాటం...'' ఊరటపలికాడు.

'' ఓసారి ఇలా రండి...'' సత్తెయ్య కాంపౌండర్‌ని పక్కకి పిలిచాడు రెండు చేతులూ జోడించి.

సత్తెయ్యతో పాటు అక్కడే వున్న గుళ్లోకి రెండడుగులేశాడు కాంపౌండర్.

సత్తెయ్య ఒక్కసారిగా మీరే దిక్కన్నట్లుగా కాళ్లమీద పడ్డాడు.

కంపౌండర్‌కి విషయం అర్థమయింది.

''సర్లే.... ఈ విషయం ఎక్కడా పొక్కదులే...'' కంపౌండర్ సత్తెయ్య భుజం తట్టి హామీ ఇచ్చి వెళ్లిపోయాడు.

మొత్తం మీద గండం గడిచి గుట్టుగా గట్టెక్కినందుకు ముచ్చటగా మూడుసార్లు గుళ్లోగంట మ్రోగించాడు సత్తెయ్య.

చేత్తోకాదు...

గుండుతో...

అదే అతని మొక్కు.

కొంతమంది గుండెనొప్పి తగ్గాలని మొక్కుకుంటారు.

కాని- సత్తెయ్య మాత్రం గుండునొప్పి తగ్గాలని మొక్కుకున్నాడు.

★